నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
24 జనవరి 2024
పేజీలు 8

స్టీల్ స్లాగ్ రోడ్

దేశంలో స్టీల్ స్లాగ్‌తో తొలి జాతీయ రహదారిని ముంబయి, గోవా మధ్య నిర్మించారు. దీన్ని జనవరి 13న ప్రారంభించారు. ఇది ఎన్‌హెచ్-66. పర్యావరణ అనుకూల రహదారి ఇదే. గతంలో దీన్ని సూరత్‌లో నిర్మించారు. అలాగే సరిహద్దు రహదారి వ్యవస్థ (బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్) కూడా అరుణాచల్‌ప్రదేశ్‌లో ఈ తరహా రోడ్డును నిర్మించింది. ఈ రెండు కూడా జాతీయ రహదారులు కావు.

అంతర్జాతీయం

ఏఐతో ఉద్యోగ నష్టం

- కృత్రిమ మేధతో 40% ఉద్యోగ నష్టం సంభవిస్తుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ పేర్కొంది. అమెరికాలోని వాషింగ్టన్ కేంద్రంగా ఈ సంస్థ పని చేస్తుంది. కృత్రిమ మేధతో అసమానతలు కూడా పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. ఇప్పటికే ఈ సవాళ్లను అధిగమించడానికి ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో భారత్‌కు చెందిన శరద్ శర్మ, అమన్‌దీప్ సింగ్, నజ్నిన్ రజ్ని సభ్యులుగా ఉన్నారు.

మలేరియా రహిత దేశం

- ఆఫ్రికా ఖండంలోని కెబో వెర్డే దేశాన్ని మలేరియా రహిత దేశంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ఆ ఖండంలో మలేరియా రహిత దేశాలుగా ఇప్పటికే మారిషస్, అల్జీరియా ఉన్నాయి.

బౌద్ధ మత సమావేశం

- ఆసియా బౌద్ధ మత 12వ సమావేశం న్యూఢిల్లీలో జనవరి 17న ప్రారంభమయ్యింది. ఈ సమావేశ ఇతివృత్తం 'బుద్ధిస్ట్ వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్'. గ్లోబల్ సౌత్ అంటే భౌగోళిక ప్రాంతం కాదు, అభివృద్ధి చెందిన లేదా చెందుతూ ఉన్న దేశాల కలయిక. భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ దీనికి నేతృత్వం వహించారు. బుద్ధుడి బోధనలు అనుసరిస్తే, విశ్వశాంతి సాధ్యమవుతుందని సమావేశం అభిప్రాయపడింది. ఏషియన్ బుద్ధిస్ట్ కాన్ఫరెన్స్ ఫర్ పీస్ అనే సంస్థ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇది ఒక స్వచ్ఛంద సంస్థ. మంగోలియా రాజధాని ఉలాన్‌బాటర్ కేంద్రంగా పనిచేస్తుంది.

తోడేళ్ల గణాంకాలు

- ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వింగ్ నేచర్ (ఐయూసీఎన్) తొలిసారిగా హిమాలయాల్లోని తోడేళ్లకు సంబంధించిన గణాంకాలను విడుదల చేసింది. వీటి సంఖ్య, విస్తరణ ప్రాంతం కూడా తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం మొత్తం హిమాలయ పర్వత శ్రేణిలో ఇవి 2275 నుంచి 3792 వరకు ఉండగా, భారత్‌లో 227 నుంచి 378 వరకు ఉండొచ్చని ఐయూసీఎన్ పేర్కొంది.

వడ్‌నగర్

- దేశంలోనే అతి పురాతన నగరంగా వడ్‌నగర్‌ను గుర్తించారు. ఇది బహుళ పొరల్లో, బహుళ సంస్కృతి ఉన్న నగరంగా చరిత్రకారులు పేర్కొన్నారు. మలి వేద కాలానికి సంబంధించిన నగరంగా భావిస్తున్నారు. సింధూ నాగరికత కాలం నాటి పట్టణాలకు ఇది కొనసాగింపు అని ఐఐటీ ఖరగ్‌పూర్ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

సంప్రదాయ భాషల జాబితాలో పార్శీ

- దేశంలోని సంప్రదాయ భాషల జాబితాలో పార్శీని కూడా చేర్చనున్నారు. భారత విదేశాంగ శాఖ మంత్రి జయశంకర్ ఇరాన్‌లో పర్యటిస్తున్నారు. ఈ మేరకు అక్కడే ఈ ప్రకటన చేశారు. ఇప్పటికే తమిళం, సంస్కృతం, కన్నడ, తెలుగు, మలయాళం, ఒడియా భాషలకు ఈ గుర్తింపు ఉంది. 1500 నుంచి 2000 సంవత్సరాల చరిత్ర కలిగి, ఇప్పటికీ నాటి సాహిత్య సంప్రదాయాలు ఉండే భాషలను ఇందులో ఎంపిక చేస్తారు.

అసర్ నివేదిక

- ఈ వార్షిక విద్యా నివేదిక విడుదలయ్యింది. దీన్ని ఇంగ్లిష్‌లో యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (అసర్) అంటారు. ప్రథమ్ అనే ఒక ప్రభుత్వేతర సంస్థ దీన్ని విడుదల చేస్తుంది. దేశ వ్యాప్తంగా 26 రాష్ట్రాల్లోని 28 జిల్లాల్లో 2023లో సర్వే నిర్వహించి ఈ నివేదికను రూపొందించారు. 14 నుంచి 18 సంవత్సరాల మధ్య ఉండే 34,745 మంది విద్యార్థులను సంప్రదించారు. దాదాపు 25% మంది తమ ప్రాంతీయ భాషకు సంబంధించి రెండో తరగతిలోని అంశాలను కూడా చదవలేకపోతున్నారు.

ఈ-సాక్షి యాప్

- మెంబర్ ఆఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా

జాతీయం

డెవలప్‌మెంట్ స్కీమ్ అమలుకు సంబంధించి ప్రత్యేకంగా ఈ-సాక్షి యాప్‌ను కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా ఎంపీలు పనుల ప్రతిపాదన చేసేందుకు వీలుంటుంది. అలాగే ఇప్పటికే కొనసాగుతున్న పనులను ట్రాక్ చేయవచ్చు, 'రియల్‌టైం' పద్ధతిలో కూడా చూడవచ్చు. నియోజకవర్గాల అభివృద్ధికి ఈ పథకాన్ని 1992లో ప్రారంభించారు. ప్రతి ఎంపీకి తమ నియోజకవర్గ అభివృద్ధికి రూ.5 కోట్లు ఇస్తారు. రాజ్యసభ సభ్యులు అయితే తాము ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రాల్లో అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. అదే నామినేటెడ్ ఎంపీలు దేశంలో ఎక్కడయినా అభివృద్ధి చేసుకోవచ్చు.

రాబందుల రెస్టారెంట్

- దేశంలో తొలిసారిగా రాబందులకు రెస్టారెంట్‌ను జార్ఖండ్‌లోని కొడెర్మా జిల్లాలో ఏర్పాటు చేయనున్నారు. రాబందుల సంరక్షణ, వాటి సంఖ్యను పెంచేందుకు ఉద్దేశించింది ఇది.

ఆపరేషన్ సద్భావన

- భారత సైన్యం దీన్ని చేపట్టింది. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం మూలంగా ప్రభావానికి గురైన ప్రజలకు సాయం చేసేందుకు ఉద్దేశించింది ఇది. ఇందులో భాగంగానే తొప పిర్ అనే గ్రామాన్ని కూడా సైన్యం దత్తత తీసుకుంది.

శిక్షణ కార్యాలయం

- నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్న పాలసముద్రంలో ప్రధాని మోదీ ప్రారంభించారు. ఐఆర్ఎస్ అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

గ్రాఫీన్ సెంటర్

- దేశంలో తొలిసారిగా ఇండియన్ ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ గ్రాఫీన్‌ను కేరళలోని కొచ్చిలో నిర్మించారు. ఆ రాష్ట్రంలోని డిజిటల్ యూనివర్సిటీ, సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్, టాటా స్టీల్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా దీన్ని ఏర్పాటు చేశాయి. గ్రాఫీన్, దాని ఉపయోగాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది.

పులుల రిజర్వ్

- దేశంలో తొలి డార్క్ స్కై పార్క్ పెంచ్ పులుల రిజర్వ్ రానుంది. ఇది మహారాష్ట్రలో ఉంది. ఆసియాలో ఈ తరహా వ్యవస్థ అయిదోది.

కచ్చికరేక్‌కు జీఐ

- కచ్చికరేక్ అనే ఫలానికి జీఐ ట్యాగ్ లభించింది. గుజరాత్ రాష్ట్రంలో ఈ తరహా స్థాయిని పొందిన రెండో ఫలం ఇది. 2011లో గిర్ కేసర్ మామిడికి జీఐ ట్యాగ్ లభించింది.

తగ్గిన పేదరికం

- 2013-14 నుంచి 2022-23 మధ్య 24.82 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని నీతి ఆయోగ్ వెల్లడించింది. మొత్తం జనాభాలో వీరి శాతం 17.89% ఉంది. విద్య, వైద్యం, జీవన ప్రమాణాల ఆధారంగా బహుళ పార్శ్వ సూచీ సాయంతో ఈ గణాంకాలను నీతి ఆయోగ్ విడుదల చేసింది. ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఈ పేదరికం తగ్గుదల అధికంగా ఉంది.

స్టార్టప్‌లకు ర్యాంకింగ్

- అంకుర సంస్థల (స్టార్టప్)కు సంబంధించిన ర్యాంకులను డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ ప్రకటించింది. మొత్తం రాష్ట్రాలను అయిదు విభాగాలుగా చేశారు.

టెస్ట్ పర్ఫామర్- గుజరాత్, కర్ణాటక, కేరళ
టాప్ పర్ఫామర్- తెలంగాణ, అరుణాచల్‌ప్రదేశ్
లీడర్స్- ఆంధ్రప్రదేశ్, అస్సాం
అస్పైరింగ్ లీడర్స్- బిహార్, హర్యానా
ఎమర్జింగ్ స్టార్టప్ ఎకో సిస్టమ్- ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ

వార్తల్లో వ్యక్తులు

లాయ్ చింగ్

- తైవాన్‌కు కొత్త అధ్యక్షుడిగా లాయ్ చింగ్-టి నియమితులయ్యారు. ఆయన ప్రజా స్వామ్య ప్రగతి పార్టీకి చెందిన వారు.

బెర్నార్డో

- గ్వాటెమాల నూతన అధ్యక్షుడిగా బెర్నార్డో అరెవాలో జనవరి 15న ప్రమాణ స్వీకారం చేశారు. ఆ దేశంలో అనేక ప్రగతిశీల ఉద్యమాల్లో ఆయన క్రియాశీల పాత్ర పోషించారు.

స్యూ రెడ్‌ఫెర్న్

- ఐసీసీ తొలి తటస్థ మహిళ అంపైర్‌గా ఇంగ్లండ్‌కు చెందిన స్యూ రెడ్‌ఫెర్న్ నియమితులయ్యారు. ఐసీసీ నిర్వహించే అన్ని మహిళ చాంపియన్‌షిప్ సిరీస్‌లకు ఆమె తటస్థ అంపైర్‌గా ఉండనున్నారు.

ప్రభా ఆత్రే

- ప్రముఖ సంప్రదాయ గాయని ప్రభా ఆత్రే మరణించారు. హిందుస్థాని సంగీతంలో కిరనగరన రాగాల్లో ఆమె పేరు తెచ్చుకున్నారు. అన్ని పద్మ అవార్డులను ఆమె పొందారు.

క్రీడలు

బీచ్ గేమ్స్

- డయ్యూలో నిర్వహించిన తొలి బీచ్ గేమ్స్‌లో ఎక్కువ పతకాలను మధ్యప్రదేశ్ రాష్ట్రం గెలుచుకుంది. జనవరి 4 నుంచి 11 వరకు ఈ క్రీడా పోటీలను నిర్వహించారు. 28 రాష్ట్రాల నుంచి దాదాపు 1404 అథ్లెట్లు పాల్గొన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం 18 పతకాలను పొందగా, మహారాష్ట్ర 14 పతకాలతో రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత తమిళనాడు, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు నిలిచాయి.

తెలంగాణ

ఎక్స్‌పో వింగ్స్ ఇండియా

- 'అమృత కాలంలో ప్రపంచానికి భారత్ అనుసంధానం' అనే ఇతివృత్తంతో ఎక్స్‌పో

వింగ్స్ ఇండియాను హైదరాబాద్‌లోని బేగంపేటలో ప్రారంభించారు. ఆసియాలోనే అతి పెద్ద విమానయాన ప్రదర్శన ఇదే. జనవరి 18 నుంచి నాలుగు రోజులు ఇది కొనసాగింది. ఉడాన్ 5.3ని ఈ సందర్భంగా ప్రారంభించారు.

పెట్టుబడులు

- ప్రపంచ ఆర్థిక ఫోరం సమావేశాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో వివిధ సంస్థలు పెట్టుబడులు పెట్టనున్నాయి. వీటికి సంబంధించిన పలు ఒప్పందాలు కుదిరాయి. అవి..

1. ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్ నెట్‌వర్క్ హైదరాబాద్‌లో ఏర్పాటు కానుంది. ఇందుకు ప్రపంచ ఆర్థిక ఫోరం, తెలంగాణ ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ తరహా కేంద్రం ఈ సంస్థకు ఇది 19వది.
2. రూ.12,400 కోట్లతో యువతకు నైపుణ్య విశ్వవిద్యాలయం స్థాపించేందుకు అదానీ సంస్థ ముందుకు వచ్చింది. అలాగే రూ.5 వేల కోట్ల పెట్టుబడితో రెండు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులను ఈ సంస్థ ఏర్పాటు చేయనుంది. 100 మెగావాట్ల సామర్థ్యంతో చందనవెల్లిలో అదానీ కనెక్స్ డేటా సెంటర్‌ను కూడా అదానీ సంస్థ ఏర్పాటు చేస్తుంది.
3. రూ.1400 కోట్లతో అంబుజా సిమెంట్ తెలంగాణలో సంస్థను ప్రారంభించనుంది.

ఆరు మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నారు.

4. జేఎన్‌డబ్ల్యూ నియో అనే సంస్థ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనుంది. ఇందుకు చేస్తున్న వ్యయం రూ.9 వేల కోట్లు.
5. గోదీ ఇండియా అనే సంస్థ గిగా స్కేల్ బ్యాటరీ సెల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఇందుకు రూ.8 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది.
6. వెబ్‌వర్క్స్ అనే సంస్థ రూ.5200 కోట్ల పెట్టుబడితో నెట్‌వర్కింగ్-హెవీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది.
7. ఔషధ పరిశ్రమల స్థాపనకు అరాజెన్ సంస్థతో ఒప్పందం కుదిరింది. ఈ సంస్థ రూ.2 వేల కోట్లతో యూనిట్‌ను ప్రారంభిస్తుంది. ఇప్పటికే ఈ సంస్థకు మల్లాపూర్‌లో సదుపాయం ఉంది. దీన్ని కూడా విస్తరిస్తారు.
8. గోద్రెజ్ సంస్థ రూ.1000 కోట్లతో రసాయన ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది.

రోజులు-ప్రత్యేకతలు

జనవరి 16: జాతీయ అంకుర సంస్థల రోజుగా జనవరి 16ను నిర్వహిస్తారు. దేశ వృద్ధిలో అంకుర సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ సంస్థల తొలి బ్యాంక్ పుణెలో ఉంది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర దీన్ని ప్రారంభించింది.

జనవరి 15: ఏటా జనవరి 15న భారత సైనిక రోజుగా నిర్వహిస్తారు. భారత సైన్యానికి సారథిగా కరియప్ప బాధ్యతలను ఇదే రోజున 1949న స్వీకరించారు. అంతకుముందు బ్రిటిష్ అధికారులే సైన్యానికి నేతృత్వం వహించేవారు.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411